
# పంట కళ్ళం పసిడి నవ్వు

డాక్టర్ లంకిపల్లి



ప్రకృతి చల్లగా మౌనగీతం పాడుతూ ఉంది. కొత్తవల్లె మంచుతెరల మునుగులో కునుకు తీస్తూంది. చలికి చెట్ల ఆకులు ముడుచుకుపోయి కదలటంలేదు. చెట్లమీద పక్షులు కూడా పలకటం లేదు.

ధర్మయ్య ఇంటి కోడిపుంజు కూసింది. అది తొలి కోడి కూత. చలికి బొంగురు పోయిన గొంతు పెగిలి కూత సరిగా రాలేదు. ధర్మయ్య కంబళి తొలగించి నిద్ర లేచి మంచంమీద కూచున్నాడు.

కోడిపుంజు మరోమారు రెక్కలు రెపరెపలార్చి కూసింది.

ఆ కూత హరిజన వాడలో మాగన్నుగా ఉన్న వెంకటయ్య చెవిలో పడింది. వెంకటయ్య దిగ్గున లేచి నప్పారు బయటికి వచ్చాడు. చినిగిన దుప్పటి తలకూ, ఒంటికి ఒకటిగా చేర్చి కప్పుకొన్నాడు. మెల్లగా కదిలాడు పొరుగూరి వైపు.

రంగాచారి ఉలికి పదును పెడ్తున్నాడు. అతని భార్య కొలిమిలో బొగ్గులు వేసి అగ్గిపుల్ల గీచి కొలిమి అంటించింది. కుప్పయ్య వేడెక్కిన ఇస్త్రీ పెట్టె అందుకొన్నాడు. జనం మలికోడి కూతతో చలి కప్పులు వదిలి త్వరత్వరగా తమ పనుల కుపక్రమించారు.

రైతులు మడక, మాను, పార సర్దుకొని కాడెద్దులతో తమ పొలాలవైపు నడుస్తున్నారు.

మంచు దట్టంగా ఉంది. మంచు పొడి వానలా రాలుతూ ఉంది. చల్లని గాలి రివ్వున వీచింది. గాలి తగిలిన చోట చర్మం మొద్దుబారుతూ ఉంది. రక్తం గడ్డకట్టుకు పోతున్నట్లుంది. చలికి భయపడే సోమరికి సేద్యం కలిసిరాదు. కోడికూత కాడె ఊత - అయినప్పుడే పంట పండుతుంది.

ఆకాశంలో అక్కడక్కడ వాన మబ్బులు కదులుతున్నాయి. పండుగ నెలలో వాన పది పనులకు చెరుపు. అందుకే వీలైనంత త్వరగా తమ పనులు ముగించటానికి వెళ్తున్నారు రైతులు.

ధర్మయ్య భార్య రమణమ్మ మజ్జిగ చిలికే కవ్వం ఆపింది. కొడుకు ప్రసాద్, కూతురు సరోజ గురకనిద్ర నుండి లేవలేదు. కొడుకు, కూతురు పెద్ద పండుగకు రావటం చాలా సంతోషంగా ఉంది రమణమ్మకు. కోడలు, అల్లుడు కూడా వచ్చి ఉంటే ఇల్లు సందడిగా, నిండుగా ఉండేది. సంక్రాంతి సంబరం చూడముచ్చటగా ఉండేది. అల్లుడు రావచ్చునేమో కాని కోడలు రాదని తెలుసు రమణమ్మకు. అదే కొండంత వెలితిగా ఉంది ఆమెకు.

** ** **

ధర్మయ్య చలికప్పుతో పొలం చేరాడు. పురిటిలో సంధి కొట్టిన పాపలా కళతప్పి ఉంది నెల తిరగని వరి మడి. తెల్ల చీడ ముసిరి పాడయింది.

నీటి మడవ తిప్పాలని వంగాడు ధర్మయ్య. మోకాళ్ళు సరిగ్గా వంగటంలేదు. చలికి చేయి వణుకుతూ ఉంది. నరాలు మొద్దుబారినట్లున్నాయి. కాలితో మడవ తిప్పాలనుకొన్నా ససేమిరా సహకరించనన్నాయి. మంచులో తడిసిన పాదాలు. శరీరం పట్టు తప్పుతున్నా మట్టిమీద మమకారం తరగని మనిషి ధర్మయ్య.

మడిలో కొంగలు తలలు వంచి కలుపు తీస్తున్నట్లు పురుగులను తింటున్నాయి. ఉన్న పైరును కాళ్ళతో నలగ తొక్కేస్తున్నాయి. ధర్మయ్య చేతులెత్తి కొంగలను అదిలించాడు. అవి లెక్కచెయ్యలేదు. గట్టిగా అదిలించాడు. కొంగలు మెడ లెత్తి చుట్టూ పరికించి చూశాయి. ధర్మయ్య గనాల మీద గబగబా నడవలేకపోయాడు. మట్టిపెళ్ళలు విసిరాడు. చలికి చేయి సాగలేదు. విసిరిన మట్టిపెళ్ళలు దూరంగా పోలేదు. కొంగలు లేచి మరో కయ్యలో వాలాయి. మడిని వదలలేదు. వాటికి పెద్ద పండుగలా ఉంది ధర్మయ్యను ఒక ఆట ఆడించాయి. ధర్మయ్యకు కొంగల దౌర్జన్యానికి గురై నలిగిపోతున్న పైరును చూస్తుంటే చెప్పలేని బాధ. కోపం వచ్చింది.

చిన్నప్పుడు చదివిన భర్తృహరి సుభాషితం గుర్తు కొచ్చింది ధర్మయ్యకు. అది 'చూపు లేమి కృషి' చెడుతుందని. అంతేకాదు నిరంతరం కృషి చేసే మనిషి కావాలి. అలాంటి మనిషి కొరతైననాడు సేద్యం నిరర్థకమే అవుతుంది.

అంత దూరం నుంచే బలరాముడు గొంతు చించుకొని కొంగల నదిలించాడు. పది మట్టిపెళ్ళలు విసిరాడు - కొంగలు పై కెగిరిపోయాయి.


ధర్మయ్య కోపంగా అన్నాడు. "ఏరా గాడిదా ! ఇంతవరకూ నిద్ర పట్టిందా నీకు? సోమరితనంతో ఒళ్ళు పెంచుకొంటే నువ్వు తండ్రికి తగ్గ కొడుకు వనిపించుకొంటావు."

తీరా పది సంవత్సరాలు నిండని పిల్లవాడు బలరాముడు.

"మెలకువ రాలేదు పెద్దయ్యా. నన్ను లేపి ఉంటే నీతోనే వచ్చేసుందును. రేపటి నుంచి చూడు నీ కంటే ముందే మడికాడ చేరత-"

బలరాముడు ధర్మయ్య తమ్ముడి కొడుకు. తమ్ముడు చిన్నప్పటి నుంచి పోసుగోలుగా తిరిగేవాడు. ధర్మయ్య మందలింపులు లెక్కపెట్టలేదు. ఊళ్ళో పెద్ద రైతులతో గొడవపెట్టుకొన్నాడు. అది ధర్మయ్యకు ఇష్టంలేదు. అంతే తన భాగం పంచుకొన్నాడు తమ్ముడు.

పెద్ద రైతులకూ, న్యాయానికీ లంకె ఉంది. అది అర్థం చేసుకొన్నప్పుడే గ్రామంలో మనుగడ.



న్యాయంలేని ఊళ్ళో క్షణం ఉండనని ధర్మయ్య తమ్ముడు ఊరు వదలి పొరుగూరికి చేరాడు. కాలం కలసిరాలేదు. కాపురం కుదుటపడలేదు. ఆ విచారంతో ఉన్న మతి పోయింది. సంసారం చితికిపోయింది. నలుగురు కొడుకులు పల్లాకుల పాలయ్యారు. వారిలో చివరివాడు బలరాముడు రెండు సంవత్సరాల క్రితం ధర్మయ్య పంచన చేరాడు.

"పెద్దయ్యా ! నేను నీతోనే ఉంటాను. సేద్యం నేర్చుకొంటాను" అన్నాడు.

రక్తపాశం - కాదనలేకపోయాడు ధర్మయ్య. ఆ రోజు నుంచి అమ్మా నాన్నలను కూడా మరిచిపోయాడు బలరాముడు. తన శక్తికొద్దీ సేద్యం పనులు నేర్చుకొంటున్నాడు. ధర్మయ్యకు చేయూత బలరాముడు. ధర్మయ్యకు బలరాముణ్ణి చూస్తే ఏదో అనుబంధం !

కూలీల కోసం పొరుగూరికి వెళ్ళిన వెంకటయ్య వచ్చాడు.

"నీకు మాయదారి రోగం వచ్చింది. మడి ఎట్లా మండిపోయిందో చూడు" అన్నాడు ధర్మయ్య.

"నే నేమైనా నాకు రోగం కావాలని కోరుకొన్నానా? ఆ సాకుతో పనికి దొంగ నయ్యానా? పది రోజులు జ్వరం పీల్చి పిప్పి చేసింది. మడి పాడయితే నాకు మాత్రం బాధగా లేదా? ఈ రోజు గడవనీ, రేపు మందు కొస్తే చీడ పీడ విరగడవుతుంది" అంటూ వెళ్ళి కరెంటు మోటర్ ఆన్ చేసి నీటి మడవ మడిమీద పెట్టాడు.

"ఎంతమంది వస్తామన్నారు కూలోళ్ళు?" ధర్మయ్య అడిగాడు.

"ఆ ఊరి నుండి మడికోతకు ముప్పైమంది రావచ్చు. మన ఊర్లో వాడె కొట్టటానికి పదిమంది మొగోళ్ళు వస్తామన్నారు. మింట మబ్బాడుతుంటే రెండు రోజులుగా కంటికి సరిగా కునుకు పట్టలేదనుకో. సాయంత్రానికి గింజలు ఇల్లు చేరకపోతే మనసు మనస్సులో ఉండదు." ధర్మయ్యకు నమ్మకమైన సేద్యగాడు వెంకటయ్య.

** ** **

పొరుగూరి కూలీలు వచ్చారు. ముప్పైమంది వరి మడి కోత ప్రారంభించారు. రంగాచారి మడి గనెం మీద కొడవళ్ళకు ఆకురాయితో కక్కు కోయటం ఆరంభించాడు. బలరాముడు మొద్దుబారిన కొడవళ్ళు కక్కు రాయించి కూలీలకు అందజేస్తున్నాడు. బండి చక్రంలా తిరుగుతున్నాడు. మడికోత చూస్తుంటే వాడిలో ఉత్సాహం కట్టలు తెంచుకొన్నది.

శుభలక్ష్మి వేడి వేడి సంగటి ముద్దలు, అనపగింజల పులుసు కొత్త తట్టలో పెట్టుకొని ధర్మయ్య పొలం వైపు బయలుదేరింది.

స్నానం చేసి ప్రసాద్ తను తెచ్చిన టేప్ రికార్డ్ ఆన్ చేసి పాటలు వింటున్నాడు. పాటలతో విసిగిన సరోజ పక్కింటికి వెళ్ళింది కొడుకుతో. ఆ సమయం కోసం వేచి కూచున్న ప్రసాద్ రమణమ్మ దగ్గర చేరాడు. తన డబ్బు అవసరం గురించి చెప్పాడు.

"చూడమ్మా, చుట్టుపక్కల ప్రతి ఇంట్లోనూ టీ.వీ. ఉంది. మా ఇంట్లోనే లేదు. పిల్లలను చుట్టుపక్కల ఇళ్ళకు పోకుండా అదుపు చేయటం కష్టంగా ఉంది. కనుమరుగైతే పొరుగిళ్ళ టీ.వీ.ల ముందు బొమ్మల్లా కూచుంటారు. పిల్లలలా వెళ్తుంటే నామోషీగా ఉంది. నీ కోడలు కలర్

## న్యాయదర్శనం

### ఇ.ఎస్.ఐ. చట్టం వర్తింపుపై కోర్టు తీర్పు

పశ్చిమ బెంగాల్‌లోని "బారానగరు సర్వీసు స్టేషను" పేర నడిపే వ్యాపార సంస్థ షాపు చట్టం క్రింద నమోదు అయినది.అది పెట్రోలు పంపు-సర్వీసు స్టేషను నడుపుతోంది. కాని ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ [ఇ.యస్.ఐ] చట్టం క్రింద మాత్రం రిజిష్టరు చేసుకోలేదు. ఇ.యస్.ఐ. వారు తమకు చెల్లించవలసిన కంట్రిబ్యూషన్ ఇవ్వమని సర్వీసు స్టేషన్‌వారికి నోటీసు ఇచ్చారు. మేము 'ఫాక్టరీ' క్రింద రాము-మా దాంట్లో "మాన్యుఫాక్చరు" ఏమీ జరగదు-అందుచేత ఇ.యస్.ఐ. చట్టం మాకు వర్తించదు, మేము ఏమీ ఇవ్వవలసిన పనిలేదని ఇ.యస్.ఐ. కోర్టులో పిటిషన్ వేశారు వారు.

పెట్రోలు పంపు కరెంటుతో నడుస్తుందని, సర్వీసింగ్ కూడా కరెంటుతో నడుస్తుందని, వాళ్ళ దగ్గర ఇరవై మంది కంటే ఎక్కువే పనివాళ్ళున్నారని అందుచేత ఇ.యస్.ఐ. చట్టంలో నిర్వచించిన "ఫాక్టరీ" క్రిందకు వస్తుందని ఇ.యస్.ఐ. వారి వాదన.

పెట్రోలు పంపు-సర్వీసు స్టేషన్ "ఫాక్టరీ" నిర్వచనం క్రిందకు వస్తుందని బారానగర్ సర్వీసు స్టేషన్ సంస్థకు వ్యతిరేకంగా తీర్పు చెప్పింది ఇ.యస్.ఐ. కోర్టు. దాని మీద హైకోర్టుకు వెళ్ళారు సర్వీస్ స్టేషన్‌వారు.

మాన్యుఫాక్చరింగ్ ప్రాసెస్ అంటే వస్తువుల తయారీ మాత్రమే కానవసరంలేదని-పెట్రోలు అమ్మడం, మోటారు వాహనాలకు సర్వీసు చేయడం లాంటిది కూడా మాన్యుఫాక్చరింగ్ కిందకు వస్తుందని అటువంటి వారికి ఇ.యస్.ఐ. చట్టం వర్తిస్తుందన్నని వారు అందుచే కంట్రిబ్యూషన్ చెల్లించవలసిందే నని కలకత్తా హైకోర్టు తీర్పు చెప్పింది.

- ఎమ్.ఎస్. శర్మ

టీ.వీ. కొనాలని ఒక్కటే పోరు: ఎలాగైనా నాన్నగారితో చెప్పి వదమ్మ్మ పది వేలు ఇప్పించు. డబ్బు లేకుండా వెళ్ళటం కుదరదు." కుండ బద్దలు కొట్టినట్లు కచ్చితంగా చెప్పాడు.

రమణమ్మకు టీ.వీ. అంటే ఏమిటో సరిగా తెలియదు. కొడుకు పది వేలు అవసరం అన్న మాట గుర్తుంచుకొన్నది. భూమిమీద పైరుండగానే కొడుకు పది వేలు అవసరం గుర్తు చేస్తే భర్త ఏమంటాడో అన్న భయం రమణమ్మకు.

ప్రసాద్ టీ.వీ. కొనటం అంత కష్టమైన పనేమీ కాదు. భార్య ఖాతాలో ఉన్న డబ్బుతో పది టీ.వీ.లు కొనవచ్చు. ఆమెకు తమ డబ్బుతో టీ.వీ. కొనటం ఇష్టంలేదు. కాని ప్రసాదుకు పొలం ఆదాయం పట్టుకెళ్ళటానికి టీ.వీ. మంచి సాకు అనిపించింది.

పక్కింటి కెళ్ళిన కూతురు వచ్చింది. అన్న ఇంట్లో లేని సమయం చూసుకొని రమణమ్మ దగ్గర చేరి ముద్దుగా చెప్పింది.

"అమ్మా మీ అల్లుడుగారు స్కూటరు కొనాలని పెద్ద ఆశ పెట్టుకొన్నారు. కొంత డబ్బు కూడా కూడబెట్టాము. స్కూటరు లేకుండా చాలా ఇబ్బంది పడుతున్నాం. ఇప్పుడు వదమ్మ్మ ఏడు వేలిస్తే స్కూటరు కొనుక్కుంటాము. ఎలాగైనా నాన్నగారితో చెప్పి డబ్బు సర్దుబాటు చెయ్యమ్మా."

రమణమ్మకు నవ్వు వచ్చింది. నాలుగు రోజులుగా కొడుకు, కూతురు కాచుకొని ఎందుకు తన చుట్టూ తిరుగుతున్నారో అర్థమయింది. అది అన్నా చెల్లెళ్ళ పోటీ - డబ్బుకు. అల్లుడికి తిరుపతిలో ఉద్యోగం. తిరుపతి తిరుమల దేవస్థానంలో ఉద్యోగులకు ఇంటి అప్పు సౌకర్యం ఉంది. స్కూటరుకూ అప్పు ఇస్తారు. వడ్డీ అతి తక్కువ. సులభ వాయిదాలలో అప్పు తీర్చవచ్చు. కాని. నేర్పుగా మంచి మాటలు చెప్పి డబ్బు తీసుకెళ్ళాలన్నది సరోజ ఉద్దేశం.

శుభలక్ష్మి సంగతి తట్టతో మడి చేరింది. బరువుతో నడుం పట్టుకొన్నట్లు ఆగింది.

వెంకటయ్య గంప దించాడు. కూలీలు చేతులు కడుక్కొని బిలబిలా వచ్చారు. చెరకుతోట గనెం వక్క నున్న ఆముదపాకులు గుంజుకొన్నారు. ఆకులు అరచేతిలో పెట్టుకొని కాలే సంగటి ఒక్కొక్క రొక్క ముద్ద అందుకొని గుంత చేశారు. గుంతలో ఒక్కో గరిటె ఆనపగింజల పులుసు పోయించుకొన్నారు. వేడి సంగటి ఆనపగింజల పులుసుతో ఎంతో రుచి ! లొట్ట లేస్తూ తిన్నారు.

బలరాముడు ఇంటి కెళ్ళి ధర్మయ్యకు టిఫిన్ తెచ్చాడు. ధర్మయ్య నాలుగు ఇడ్లీలు తిన్నాడు. కొడుకు, కూతురు ఉన్నారు కాబట్టి ఉదయం టిఫిన్.

"బంగారు తల్లి, చేతి వంట అమృతంలా ఉంది" అంటూ శుభలక్ష్మిని పొగడారు కూలీలు.

కొందరు శుభలక్ష్మిని చూసి జాలి చూపారు. "కష్టాలన్నీ మంచివారికే. ఏం దేవుడో !" నిట్టూర్పు విడిచారు ఆడవాళ్ళు.

శుభలక్ష్మి చిన్న వయస్సులో గాజూ, పూసా పోగొట్టుకొన్న అభాగ్యురాలు. ఆమె భర్త గోపాలు కొత్తపల్లెలో అటు రైతు, ఇటు కూలి కాని మనిషి. తన పది గుంటల మడి పైరెక్కించి ఇతరులకు సహాయపడేవాడు. గోపాలుది చింతలు లేని చిన్న కుటుంబం - అందమైన భార్య అనుకూలవతి; ముద్దులొలికే కొడుకు; సంతృప్తి సంతోషంగా సాగే సంసారం - వారి అనురాగ దాంపత్య జీవితాన్ని కాటేసింది కాలం.

ఒక రోజు గోపాలు ధర్మయ్య మడికి ఆకు కొడ్తూ ఉండగా పుండు పుట్టి చచ్చుపడిన వేపమాను కొమ్మ విరిగింది. ఆకు కొడ్తున్న గోపాలు కొమ్మతో పాటు కింద పడ్డాడు. నెత్తురు గాయాలు తగలలేదు. కాని నడుం సరిగా నిలవలేదు. ధర్మయ్య ఆస్పత్రిలో చేర్పించాడు. కట్లు వేయించాడు. వేలుకు వేలు డబ్బు ఖర్చయింది. నడుం సరిగా రాలేదు. మూడు నెలలకు గోపాలు కన్ను మూశాడు. అతని పది గుంటల మడిని వైద్యం కబళించింది. శుభలక్ష్మి మూడేళ్ళ కొడుకుతో దిగులుపడి నీరసించింది.

వ్యవసాయ కూలీలకు పెన్షన్ లేదు. ఇన్సూరెన్స్ లేదు. సెక్యూరిటీ లేని సంసారాలు. శుభలక్ష్మికి ధర్మయ్య ధైర్యం చెప్పాడు - తన ఇంటి దగ్గరే పనులు చూసుకోమని. ధర్మయ్య ఇంటి మనిషిగా స్థిరపడింది శుభలక్ష్మి.

ఆ రోజు శుభలక్ష్మికి క్షణం తీరికలేని పని. కూలీలకు మధ్యాహ్నా భోజనం వండి తట్టకు సర్దింది. శుభలక్ష్మితో రమణమ్మ కూడా పొలం వెళ్ళింది. భోజనాలు ముగిశాయి. కూలీలు మడి కోత కెళ్ళారు. కొంతమంది వాదె కొట్టడానికి కళ్ళం చేశారు.

ధర్మయ్య మర్రిచెట్టు నీడన బండిమీద టవల్ పరిచి నడుం వాల్చాడు. రమణమ్మ దగ్గర్లోనే కూచుంది.

అరగంటకు లేచిన ధర్మయ్య రమణమ్మను చూసి కొంత ఆశ్చర్యపోయాడు. విశేషం ఏమిటని అడిగాడు. విషయం చెప్పింది రమణమ్మ.


"డబ్బు ఇస్తే కొడుకు రేపే ప్రయాణం. కూతురు మాత్రం అల్లుడు వచ్చిన తరువాత పండుగ చూసుకొని తీరిగ్గా వెళ్తుంది."

"ఇప్పుడు డబ్బు ఎక్కడ ఉంది?"

"కోతమడి వడ్లు అమ్మకం."

"అంతేనా? ఇంకేమైనా రాయబారం ఉందా?" అతని కోపం మాటల్లో ప్రతిధ్వనించింది.

"ఇంకేమీ లేదు."



ధర్మయ్య గుబురు మీసాల మధ్య కోపం చిక్కుకొంది. కోత మడివైపు నడిచాడు.

రమణమ్మ మిరపతోటలో ఎర్రగడ్డలు, తెల్లగడ్డలు నాటడానికి వంగింది. ధర్మయ్యకు కళ్ళంలో వడ్లమ్మటం కొత్తగా ఉంది. ఏదైనా అత్యవసరముంటే తప్ప ఏ రైతూ కళ్ళంలో ధాన్యరాశిని విక్రయించడు. ధర్మయ్యలో ఆలోచన కదిలింది. కూతురుకు డబ్బు కావాలి. కొడుక్కు డబ్బు కావాలి. ఎందుకు ? జీవిత విలాసాలకు. అవి వారి అవసరాలు. మరి పైరు జీవనం సాగించే రైతాంగం ఆకలి తీర్చటాని కేమివ్వాలి? మరో పంటవరకు వాయిదా వేయవచ్చు. మండే కడుపులు ఊరుకుంటాయా? మరో పంట సక్రమంగా వస్తుందన్న నమ్మకంలేదు - డబ్బివ్వకపోతే కొడుకూ, కూతురూ అలిగిపోవచ్చు. ఇద్దరికీ పంచితే ఎవరికీ సంతృప్తి ఉండదు. అసలు వడ్లన్నీ కళ్ళంలో అమ్మేస్తే వడ్లు ఎలా పాతబడతాయి? పాత వడ్లయితే బియ్యం కలిసి వస్తాయి. అన్నం బాగుంటుంది. ఇవన్నీ వారికెలా తెలుస్తుంది? వారికి కావలసింది డబ్బు.

ధర్మయ్యకు కొడుకంటే ప్రేమ ఉంది. అది మానవ సహజం. కాని రైతుబిడ్డ అనే అభిమానం లేదు. అందుకు కారణాలు ధర్మయ్య మనసులో ఎప్పుడూ మెదులుతూ ఉంటాయి. పొలం అంటే ప్రేమలేని వాడు ప్రసాద్. బురదంటే భయపడేవాడు. మడక మేడి పట్టటం చిన్నతనంగా భావించే మనస్తత్వం. చదువు అబ్బినంత మాత్రాన సేద్యంపైన అయిష్టత ఎందుకు పెంచుకోవాలి? కలం, హలం రెండింటినీ సమానంగా చేపట్టిన బమ్మెర పోతన అంటే ధర్మయ్యకు మహా అభిమానం. బాల రామాయణం, అమరం, గజేంద్రమోక్షం కంఠతా వచ్చిన ధర్మయ్యకు వంటబట్టని ప్రసాద్ చదువుపైన పెద్ద గౌరవం లేదు.

ప్రసాద్ ఎమ్. ఏ. చదివే రోజుల్లోనే ప్రేమలో పడ్డాడు. ఆ అమ్మాయే తన్ను స్వర్గంలోకి లాగిందంటాడు. ఏది నిజమో తెలియదు. ముక్కు - ముఖం తెలియని పిల్లతో తమ అనుమతి లేకుండా ప్రసాద్ పెళ్ళి నిశ్చయానికి రావటం రమణమ్మకు ఇష్టంలేదు. ఆ విషయం ధర్మయ్యకు చెప్పింది. ఆ సంబంధం కాదంటే కొడుకు గొత్తులో నిలిచేటట్లు లేదు. ధర్మయ్య తన చేతి ఖర్చులతో కొడుకు పెళ్ళి జరిపించి పరువు నెలబెట్టుకొన్నాడు. కొత్త పెళ్ళికూతురు కొత్త పల్లెకు ఉదయం పది గంటలకు వచ్చి సాయంత్రం నాలుగు గంటలకు తిరుగు ప్రయాణం కట్టింది. అక్కడున్నంతసేపూ పరువు దిగలేదు. అది ముళ్ళపరుపులా తోచింది ఆమెకు. అటు తరువాత ఏడు సంవత్సరాల్లో అప్పుడప్పుడు ప్రసాద్ రావటం జరిగింది కాని ఆమె కొత్త పల్లెకు రాలేదు. వచ్చిన ప్రతి మారూ ప్రసాద్ కొంత డబ్బు అవసరాలకని జమ చేసుకెళ్తున్నాడు. ధర్మయ్య దృష్టిలో భార్యా విధేయులు చాలామంది ఉన్నారు. యదుకుల భూషణుడు సత్యభామా విధేయుడు. భార్యా విధేయ భూషణం - ప్రసాద్.

ప్రసాద్ పెళ్ళి జరిగిన సంవత్సరానికి మరో సమస్య ఎదురయ్యింది ధర్మయ్యకు. కూతురు సరోజ ఉద్యోగం చేసే భర్త కావాలని పట్టుబట్టింది. ధర్మయ్య పైరు జీవనం గడుపుతూ కూడబెట్టింది లేదు. అతని మిగులు ఆదాయం కొడుకు చదువులకు కూడా చాలలేదు. పిత్రార్జితం ప్రాణప్రదమైన భూమిని అమ్మి కూతురు పెళ్ళి జరిపించాడు. ఋణం వ్రణం వంటిది. ప్రసాద్ చదువుకు చేసిన అప్పును తీర్చాడు.

అటు ప్రసాద్ గాని, సరోజ గాని ఏ సందర్భంలోనూ తల్లితండ్రులను తమతో రమ్మని ఒక మాట అని వారికి సంతోషం పంచిపెట్టి ఎరుగరు. వారికి ఆ మాటే గుర్తు లేదు.

ధర్మయ్య దంపతులకు అది ఎదలో అప్పుడప్పుడు గుచ్చుకొనే విషపు ముల్లు. వృద్ధాప్యంలో అవసరమైనప్పుడు వారు ఆదుకొంటారనే మాట ధర్మయ్య కలలో కూడా అనుకోలేదు.

** ** **

పొద్దు వాటారింది. మింట మునురు మబ్బులు తొలిగాయి. జనం చాలామంది కాబట్టి రెండు జట్లుగా వార్లై కొడ్తున్నారు. స్త్రీలు వార్లైలు మోస్తున్నారు. ఒకరికి ముందొకరు పరుగులు తీస్తున్నారు. వాదె కొట్టేవాళ్ళు సరిగా తేలని గాలిని పిలుస్తున్నారు.

"పొలిగా రారా ! పొలో పొలి !"

"కట్టమీద గంగమ్మ, కాణిపాకు పిళ్ళారాయుడు - పొలో పొలి."

కూలీలు వావివరసలు కలిపి మాటల పూబంతులు విసురుకొంటున్నారు. పడుచువారు వలపు చూపుల జల్లులు కురిపిస్తున్నారు. కులం, మతం - అడ్డుగోడలు లేని శ్రామిక జనం. పని చేయటం వారికి సంబరం. పంట చేనిలో, పడుచు గుండెల్లో పెద్దల మాటల్లో - సంక్రాంతి లక్ష్మి కాంతి కనపడుతూ ఉంది.

టిఫిన్, కాఫీ సేవించి తీరిగ్గా పొలం వైపు నడిచాడు ప్రసాద్. సిగరెట్టు పొగ సుడులు తిరుగుతూ ఉంటే అతని ఆలోచనలో డబ్బు ఎలాగైనా రాబట్టాలనే పట్టుదల పెరుగుతూ ఉంది. బహుశా చెల్లెలు కూడా డబ్బు అడగవచ్చుననే సందేహం లేకపోలేదు. ఈమారు చెల్లెలికి డబ్బు చేరకుండా పట్టుకుపోవాలి - అదే అతని పట్టుదల.

రంగాచారి, అతని భార్య కళ్ళం చేరటం చూశాడు ప్రసాద్. ఇలాగే మరి కొందరు కళ్ళం దోచుకొనే దానికి వస్తారేమోనని అనుకొన్నాడు.

"ప్రసాద్ బాబూ, బాగున్నావా?" ఆప్యాయంగా అడిగాడు రంగాచారి.

"ఊఁ. నువ్వు బాగున్నావా?" ముభావంగా ఏదో పలకరించినప్పుడు అడగాలి కాబట్టి అడిగాడు.


"ఏం బాగులే బాబూ. బాడిసెతో కొయ్యలు చెక్కి చెక్కి గూళ్ళు కదిలిపోయాయి. ఉలి గూటంతో రంధ్రాలు కొట్టి కొట్టి మణికట్టు పట్టు తప్పింది - రేయింబవళ్ళు కండలు కరిగి ఇద్దరు కొడుకులకు - చదువులు చెప్పింది పెళ్ళిళ్ళు చేస్తే ఎవడిదారిన వాడు పోయాడు. నన్ను మీతో తీసుకపోండిరా అంటే నవ్వుతారు. - భిక్షం వేసినట్లు వారికి తోచినప్పుడు కొంత డబ్బు పంపుతారు. అది కూటికి చాలదు. గుడ్డకు అందదు... నేను వాళ్ళతో ఉంటే వాళ్ళ పెళ్ళాం పిల్లల మధ్య పానకంలో పుడకలా అడ్డుపడుతానా?"

రంగాచారి అంత సోది చెప్తా డనుకోలేదు ప్రసాద్. అది తనకూ చురకేనేమో అనే సందేహం కూడా కలిగింది.

"అక్కడ కూడా సుక్క కావాలంటావేమోనని వారి భయమేమో?" సరిగా అంటించా ననుకొన్నాడు ప్రసాద్.

"ఉద్యోగాలు చేసే మీరంతా ఒకే జాతి. తెలియ కడుగుతాను ప్రసాదు బాబూ, తమరు సిగరెట్లెందుకు కాలుస్తున్నారు? రోజుకు పది రూపాయలు ఖర్చు మీ సెగరెట్లకు. నేను కల్లు తాగే మాట నిజమే. కాయకష్టంతో కదలిన కండరాల నొప్పి మరిచి నిద్రపోవటానికి తాగుతాను. రోజుకు మహా అంటే రూపాయ కల్లు. కల్లు తల్లిపాలుతో సమానం." రంగాచారి స్వగతంలా గొణిగాడు.

వృత్తి పని వారంతా మేరకు, కట్టకు వస్తున్నారు. సంవత్సరం పని చేస్తే వారికి ఆరు నెలల కొకమారు వరికట్ట, మేర గింజలు వస్తాయి. కట్ట, మేర జీవనంగా బ్రతికే వృత్తి పనివారు. రైతు, కూలి, వృత్తి పనివారు కలిస్తే రైతాంగం - రైతాంగం బాగుంటేనే రాజ్యం బాగు. కాని మారుతున్న సమాజ పరిస్థితుల ఉరవడిలో ఆ సత్యం గమనించే మనిషే కరు వవుతున్నాడేమో ! వృత్తి పనివారు కోతల కాలం కునికిపాట్లు పడితే మిగతా కాలం కడుపుకోత తప్పదు. వృత్తి పనివారు



దోపిడీదార్లుగా కనపడ్డారు ప్రసాద్‌కు. వీళ్ళంతా తలా కొంచెం మూటగట్టుకపోతే ఇక కళ్ళంలో ఎన్ని వడ్లు మిగులుతాయి? ఇది అతని సంకుచిత మనస్తత్వం భావన.

చివరగా పంబల నాంచారు వచ్చాడు. తలగుడ్డ తలపైన జానెడెత్తు ఊగుతూ ఉంది. ముతక జుబ్బా; ముక్కాలు చొక్కాలా ఉంది. పంబల లేదు. కాని పంబల మోగినట్లే గొంతు సవరించుకొన్నాడు నాంచారు.

"మహా ప్రభువులు - ధర్మప్రభువులు- ధర్మదాతలు ..."

"ఎవరు నువ్వు?" ఎక్కసంగా అడిగాడు ప్రసాదు.

"నన్ను గుర్తు పట్టలేదా దొరా? ప్రసాదు బాబుగారూ, తమ దయ మాపైన బాగుండాల."

"అందుకేం కొదవలేదు. చెవుల బోరు పణతలు ఎంత దూరాన ఉన్న శవం వాసనైనా పసిగట్టి వచ్చి వాలుతాయట. అలా ఉంది నీ రాక."

ప్రసాదు మాటలతో నాంచారు హృదయం చివుక్కుమంది. అతనికి దోచుకోవటం తెలియదు.

"అలా అంటే ఎట్లా ప్రభో? సంవత్సరాని కొక పంట."

అసలు అతను ధర్మం అడుగలేదు. అతను చేసే పనికి కూలి - కట్ట, మేర. పంబల మోగనిదే దేవర లేదు. పెళ్ళిళ్ళు జరగవు. అది ఎలా చెప్పాలి ప్రసాద్‌కు? పై చదువులు చదివిన మనిషి కెందుకు సామాన్య విషయాలు తెలియవు? అప్పటికే చాలామందికి ప్రసాద్ వాలకం అర్థమైంది. 'ఇత నెక్కడ దాపురించాడు మా కడుపులు కొట్టటానికని' కొందరు గుసగుసలు పోయారు.

"మీ రందరూ కూడగట్టుకొని పంట వచ్చే సమయాని కొచ్చి దోచుకపోబట్టే రైతులు వెనుకబడిపోయారు" అన్నాడు ప్రసాద్ కసిగా.

రంగాచారికి కోపం వచ్చింది. ధర్మయ్యతో కూడా అతను చదువుకొన్నాడు, తీవ్రంగానే మాట్లాడాడు.

"ఏం బాబూ, మేం దోచుకొంటున్నది ఎంత? దాచుకొంటున్నది ఎంత? కొయ్య వడ్రంగి ఇంటి కొస్తే మడక అవుతుంది; బండి చక్ర మవుతుంది. మట్టి కుమ్మ రింట కుండవుతుంది. పదిమందికీ కూడు ఉడికే పాత్రవుతుంది. మంగలి ముందు కూచుంటే మాసిన గడ్డం నునువవుతుంది. మురికి గుడ్డ చాకలింట కొస్తే మురికిపోయి శుభ్ర మవుతుంది. మాకేం మిగిలింది? వడ్రంగి ఇంట్లో కొయ్యపేళ్ళు, మంగలి దిబ్బలో బొచ్చు, కుమ్మరి ఇంట్లో కాళీ కుండలు ! మీ చేతులు పొడుగని మా మూతులు పొడుస్తారా?"

గనాల మీద ఎద్దుల మేపుకొంటున్న ధర్మయ్య కల్పించుకొన్నాడు.

"ఏం లేదు ధర్మయ్యా ! మా ఆవు ఉంది. తన దూడ పొదుగు కుమ్మి, కుమ్మి పాలు తాగితే ఊరుకొంటుంది. కాని గడ్డి పెట్టి మేపే నన్ను దగ్గరకు చేరనివ్వదు - అది గుర్తు కొచ్చింది."

రంగాచారికి కోపం వస్తే మనిషి కాదు. పాకం ముదరకముందే ధర్మయ్య మందలించాడు. "ఒరే రంగా ! నోరు మూస్తావా, లేదా?"

"ఓయబ్బో, ఏం? నీ కొడుకును కొరతెయ్యటానికి ప్రయత్నించలేదులే. కొడుక్కు తండ్రి వత్తాను."

రంగాచారి నోటికి తాళం వేశాడు. వాతావరణం చల్లబడింది.

"మా ఆవిడ పొద్దస్తమానం ఏదో ఒకటి వాగుతూ నా మెదడంతా తినేస్తోంది. ఏం చేయాలి?" విచారంగా అడిగాడు శివం.

"నీ రెండు పెదవులు కలిసి ఉంటే ఎం తందంగా ఉంటావో తెలుసా? అని పదే పదే మీ ఆవిడతో అను - ఫలితం కనిపిస్తుంది." ధీమాగా చెప్పాడు సత్యం.


వాలి హిరణ్మయీదేవి

◆◆◆

"సార్ ! లెటర్స్ ఓపెన్ చేసే మెషిన్ వచ్చింది కావాలా సార్!" భన్వంత్‌ని అడిగాడు సేల్స్‌మెన్.

"కొనటమేమిటయ్యా కర్మ ఒక దానిని పెళ్ళి చేసుకుంటేనూ."

జి. రామమూర్తి




తన తరువాత ఎలా జరుగుతుంది ఈ సేద్యం? ప్రసాద్ సాగించబోయే దానితో తను బ్రతకలేడు; అది మరొకరు బతకడానికి ఉపకరించదు. ఆ మాట తలచుకొంటే ఎదలో బాధ సుడులు తిరుగుతుంది. ఏ రాజ్యానికి రా జెవరో? ఈ సేద్యానికి వారసు డెవడో? అది ధర్మయ్యను వీడని ఆలోచన.

** ** **

రాశి పెరిగే కొద్దీ పనివారిలో, కూలీల్లో సంతోషం పెరుగుతూ ఉంది. భూమి ఎవరిదైనా కావచ్చు. పంట ఎవరిదైనా కావచ్చు. ధాన్య రాశి పెరిగేటప్పుడు కళ్ళంలో పని చేసే వారి ఆనందానికి అవధులు ఉండవు. వారి భావాలకు అక్షర రూపం ఇవ్వటం ఏ రచయితకు అలవికాని పని.

ధర్మయ్యలో సంఘర్షణ చెలరేగుతూ ఉంది. వృత్తి పనివారు, వ్యవసాయ కూలీలు పైరుమీద కళ్ళు పెట్టుకొని బ్రతికే వారే. అయిదు వేళ్ళు కలిసినప్పుడే పిడికిలి. పిడికిలి బిగిసినప్పుడే పని. రైతాంగం కలసి పని చేసినప్పుడే పంట.

పచ్చని పైరును ప్రేమించలేని మనుషులకు పంటపైన అధికారం ఎలా ఉంటుంది? రైతు న్యాయం ఎలా ఉండాలి? ఇది ధర్మయ్యలో తర్జన భర్జన. కాని కొడుకూ, కూతురూ ఒకవైపు డబ్బుకై ఎదురుచూస్తున్నారు. మమకారం తెరలా మనస్సును కప్పుతూ ఉంది. ధర్మం మరుగున పడుతూ ఉంది. కొడుకు, కూతుళ్ళ కోరికలు తీరాలంటే వృత్తి పనివారు వట్టి చేతుల్తో ఇళ్ళ కెళ్ళక తప్పదు. నిట్టూర్చాడు ధర్మయ్య.

వ్యష్టికంటే సమిష్టికే ప్రాధాన్యం ఇచ్చిన గ్రామీణ, ఆర్థిక, సామాజిక వ్యవస్థ మనది. సమతా, మమతల పునాదులపైన పెరిగిన సంస్కృతి. అపురూపమైన సమతా భావాన్ని పెంచిన గ్రామ సంస్కృతి. రైతు, వృత్తి పనివారు వ్యవసాయ కూలీలను కలిపినప్పుడే న్యాయమైన ఆర్థిక స్వరూపం అర్థమవుతుంది. కాలక్రమేణా మనిషిలో స్వార్థం పెరిగింది. సమత భావన తరిగింది. సమాజం సమాంతరంగా చీలుతూ ఉంది. రైతులు, వృత్తి పనివారు, వ్యవసాయ కూలీలనే వర్గీకరణ జరిగింది. వర్గభేదం అఘాతంలా మారినప్పుడు, సమాజంలో సంఘర్షణ తప్పదు. గ్రామ సమిష్టి వ్యవస్థ పునాదులు కదిలిపోతున్నాయి. మార్పు సహజం. కాని సరైన ప్రత్యామ్నాయ మార్గం కనుచూపు మేరలో కనపడదు. రైతాంగం మధ్య భేదాభిప్రాయాలు రెచ్చగొట్టే వారున్నారు. ప్రశాంత పల్లె జీవితాల మధ్య అశాంతిని రగిల్చే పెద్దమనుషు లున్నారు.

ప్రసాద్ వడ్ల రాశిని అంచనా వేయటానికి ప్రయత్నించాడు. వడ్ల రాశి రూపాయల్లోకి మారుతూ ఉంది - అతని ఆలోచనల్లో.

కూలీలు కొందరు తూర్పార బడుతుంటే కొందరు ఒకవైపున కళ్ళంలో వాదె కొడ్తున్నారు. మూడు భాగాలు వాదె కొట్టటం అయింది. సగం తూర్పారబట్టటం జరిగింది. ఎలాగైనా పొద్దు పోకముందే వడ్లు ఇల్లు చేరాలనే తొందర అందరిలోనూ ఉంది. ధాన్య రాశికి పొలి చుట్టాడు వెంకటయ్య. కొంతమంది వడ్లు గోతాలకు పోసి మూతులు గోగునారతో కట్టుతున్నారు.

వృత్తి పనివారు దూరంగా గనెంపైన కూర్చున్న ధర్మయ్యను చేరారు. కార్తీకం వరిమడి చీడతో పాడయింది. కాబట్టి, వాదె కొట్టే మడిలోనే

ఒక్కొక్కరు రేండేసి కట్టలు కట్టుకొంటామని నసుగుతూ చెప్పారు. ధర్మయ్య చిరునవ్వు మీసాలు దాటింది. ఒక్కొక్కరినీ వారు ఎత్తగల మోపులు రెండేసి కట్టుకొమ్మన్నాడు. సంతోషంగా ఒకరి ముందొకరు కట్టలు కట్టారు పనివారు. వాదెలు అయిపోయాయి. మరో అరగంట పడుతుందన్న వాదె కోట్ట పని ఆగిపోయింది. పనివారి కట్టల్లోకి అమరిపోయింది కోసిన పైరు.

ప్రసాద్‌కు పనివారి మీద కోపం ముంచుకొచ్చింది. కనీసం అయిదు మూటల వడ్లు కట్టలుగా కొట్టేశారు వెధవ లనుకొన్నాడు. ధర్మయ్యను చూశాడు. అతని ముఖం ప్రసన్నంగా ఉంది. తండ్రిపైన కోపం బుసలు కొట్టింది. పైకి మాత్రం పెదవి కదపలేదు. చెరువు తెంచి చేపలు పట్టి అమ్మా లన్నట్లుంది అతని ఆశ.

** ** **

వెంకటయ్య ఎద్దుల బండి తోలుకొచ్చాడు. పది మూటలు బండికి భర్తీ చేశారు. బండి కదిలింది. తల గుడ్డలు తీసి నేలకేసి కొంతమంది కూలీలు కూచున్నారు.

ధర్మయ్య దగ్గర్లో గనెం మీద కూచున్నాడు. రమణమ్మను కూలి వారికి ఒక్కొక్కరికీ రెండేసి నిండు చాటల వడ్లు పెట్టమన్నాడు. కూలీలు వరుసగా నిలబడ్డారు. కూలి గింజలు కొంతమంది పైగుడ్డల్లో మూట కట్టుకొన్నారు. కొందరు సంచుల్లో, బుట్టల్లో పోసుకొన్నారు. కూలీలకు - మడి కోతకు వచ్చిన వారికి, వాదె కొట్టిన వారికి - అయిదు మూటల వడ్లు సరిపోయాయి అనుకొన్నాడు ప్రసాద్.

వృత్తి పనివారికి ఒక్కొక్కరికీ సంవత్సరానికి ఒకేసారి రెండేసి మేరలు కొలవమన్నాడు ధర్మయ్య.

అలాగే కొలిచాడు మరో పెద్ద కూలి మనిషి. ఒక మేర పది బల్లలు - అంటే ఇరవై శేర్లు. వృత్తి పనివారికి మేరలు ఇచ్చేసరికి కళ్ళంలో ధాన్య రాశి మరింత తరిగింది.

ధాన్యరాశి తరిగేకొద్దీ ప్రసాద్‌లో కోపం ముంచుకొస్తూ ఉంది. కూలీలకూ, వృత్తి పనివారికీ సంతోషంగా ఉంది. వారికి పెద్ద పండుగ ముందుకు వచ్చినట్లనిపించింది.

బండి రెండోమారు వడ్ల మూటలు భర్తీ చేసుకొని వెళ్ళింది. అడపాదడపా ఫని పాట్లకు పలికే వారికి తిరిపం ఒక్కో చేట వడ్లు పెట్టింది రమణమ్మ.

వెంకటయ్య మూడోమారు వడ్ల మూటలు బండికి భర్తీ చేశాడు. ధర్మయ్య వెంకటయ్యను దగ్గరకు రమ్మన్నాడు.

"అయిదు మూటలు శుభలక్ష్మి ఇంట్లో దించు. మిగిలిన అయిదు మూటలు నీ ఇంటికి తీసుకొని పో" అన్నాడు.

వెంకటయ్య గుండె నిండా కృతజ్ఞత, ఆనందం. వృత్తి పనివారికీ, కూలీలకు ఎంత సంతోషమో వారి కళ్ళలో వెలుగే చెప్తా ఉంది సంక్రాంతి వచ్చినట్లు. చెరువుకు నీటి ఆశ, నీటికి చెరువు ఆశ. ఆశ తీరినట్లనిపించింది.

ప్రసాద్ పథకం వరి కుప్పపైన పడుకొని పట్టి కలలు కన్నట్లే అయింది. అతని ప్లాను తలకిందులైంది. తండ్రి వడ్లమ్మి డబ్బు ఇస్తాడనే నమ్మకం వమ్మయింది. కోపంతో ఊగిపోయాడు. గొంతు పెగిలింది.

## భారతంలో భాషలు

మన భారతదేశంలో ఎన్ని భాష లున్నాయంటే పదిహేను అని ఠక్కున చెప్పేస్తాం. ఎందుకంటే రాజ్యాంగంలో పేర్కొన్నవి అన్నే కనుక. అయితే చిల్లర మల్లర భాషలు కొన్ని వంద లున్న విషయం కొంతమందికి తెలుసు. అయితే కచ్చితంగా ఎన్ని ఉన్నాయో తెలిసినవారు చాలా తక్కువ. గణాంక వివరాల ప్రకారం దేశంలో చిన్నా పెద్దా అన్నీ కలిసి 1600 వరకు భాష లున్నాయట.

-కె. ఆర్. కె. మోహన్

"పండిన ధాన్యమంతా కళ్ళంలో సమారాధన చేస్తే ఇక మిగిలిందేమిటి?" అన్నాడు తండ్రి నుద్దేశించి.

"ఎవరి అవసరాలు వారివి. కొందరికి విలాసాలు - వ్యసనం. కొందరికి కడుపుకూటి అవసరం. ఎవరి స్వార్థం వారిది." తేలిగ్గా నవ్వాడు ధర్మయ్య.

"అంటే?" రెట్టించాడు ప్రసాద్.

ప్రసాదు రెట్టింపులో అసహనం ఉంది; ధిక్కార ధ్వని ఉంది. అతని వాలకం చూసిన ధర్మయ్యకు సరైన సమాధానం చెప్పా లనిపించింది.

ఇళ్ళకు వెళ్ళాలని సర్దుకొంటున్న కూలీలు ఆగిపోయారు. వృత్తి పనివారు కళ్ళప్పగించి తండ్రీ కొడుకులను చూస్తూ నిలుచున్నారు.

ధర్మయ్యకు ప్రసాద్ మాట తీరు, కుప్ప విత్తనాలు - చప్పనారులా తోచాయి. ధర్మయ్య దీర్ఘంగా నిట్టూర్చాడు. తన అభిప్రాయం తేటతెల్లం చేశాడు.

"ప్రసాద్ ! ఆర్థిక వనరులు ఎవరి అధీనంలోనూ లేవు. గాలి, నీరు, భూమి ఎవరి సొమ్మూ కాదు. మన తాత తండ్రులు మడక పట్టి శ్రద్ధతో భూమిని దున్ని జీవనం సాగించారు. చెమటోడ్చి గుంటకు గుంట కలిపారు. అది పిత్రార్జితమైంది. పిత్రార్జితమైన భూమి అమ్మకంతో నీ చదువుకు చేసిన అప్పు తీరింది. నీ చెల్లెలు పెళ్ళి జరిగింది. మిగిలిన ఈ భూమి నేనుగా నిరంతరం మట్టిని నమ్మి బ్రతికినందుకు గుర్తు; నే సంపాదించిన ఆస్తి...

"మడక దున్నినవారు, నారు పోసినవారు, నీరు కట్టినవారు, మడి నాటినవారు, కలుపు తీసినవారు, పంట కోసి, వాదె కొట్టి, ధాన్యం రాశి పోసినవారు - అందరూ నన్ను నమ్మినవారు. నేను పిలవగానే వచ్చేవారు. నేను భూమిని దున్ని పైరు పెట్టేకాలం పోయింది. ఈ భూమికి ఇప్పుడు నే నొక కాపలాదారుగా మాత్రం ఇక్కడున్నాను. పరస్పర సహకారంతో సాగుతున్న గ్రామీణ జీవితం ఇది.

"మీ చదువు లేమి చెప్తున్నాయో నాకు తెలియదు. చట్టా లేవిధంగా మార్పుల రంగులు పులుముకొంటున్నాయో తెలియదు. మనసులు మారనప్పుడు, మనుషులు ఎదగనప్పుడు చట్టాలు కాగితాల మీదనే ఉంటాయి. అవి ఆచరణలోకి రావు. ఆచరణకు పనికిరాని చట్టం ప్రయోజనం ఎంత?

"పంట పండించిన వాడికే మొదటి భాగం. అది ఎంతైనా కావచ్చు. ఇక మిగిలింది భూమి సంపాదించిన ఆసామిది. నేను భూస్వామిని కాను. సామాన్య రైతును. రైతాంగం అర్థం తెలిసిన వాడిని. రైతు బహు కుటుంబికుడు.

"మేము - అంటే రైతాంగం భూమిని నమ్మి పైరు జీవనం సాగించేవాళ్ళం. కష్టపడిన వారికి న్యాయంగా భాగం పోగా మిగిలింది మాకు - మీ అమ్మకూ, నాకూ. ఇది రైతుగా నేను నేర్చుకొన్న పాఠం. నా జీవనవేదం. నా జీవితమంత సత్యం."

రంగాచారి అంతరాత్మ పలికింది - ధర్మయ్య నూరు కాకులలో ఒక కోయిలని.

ధర్మయ్య మనసు వర్షించిన మేఘంలా తేలికపడింది. కర్షక జనంతో కలిసి కొత్తపల్లె వైపు నడిచాడు. బలరాముడు నెత్తిమీద చెరకు మోసుల కట్ట పెట్టుకొని, ఎద్దులు పట్టుకొని ధర్మయ్య వెంట నడిచాడు.

ప్రసాద్‌కు చలి పుట్టింది. పెదవులు గడగడ వణికాయి. ముఖం నల్లబడింది. అతి బలవంతంమీద కాళ్ళు ముందుకు కదిలాయి.

వడ్ల బండి కదిలింది. బండిలో మూటల మీద కూచున్న రమణమ్మ వెనక్కు తిరిగి చూసింది.

ఆకాశంలో ఎగురుతున్న పక్షులు కిలకిల పలకరించుకొన్నాయి. పంట కళ్ళం పిలుస్తున్నట్లు గువ్వల గుంపు కళ్ళంలో వాలింది.

సాయం సంధ్యలో పంట కళ్ళం నిండుగా నవ్వుతున్నట్లుంది. ★

